




గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 950 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# చలం జీవితం – సాహిత్యం

## -19-

"నా పుస్తకాలు జాగ్రత్తగా చదివిన వారికి, 'అసలు సత్యం ఏమిటనీ, ఈ సమస్యలన్నిటినీ తీర్చగల "అల్టిమేట్ ట్రూత్" వుందా? ఉన్నట్లు కనపడుతుందా?' అనే వెతుకులాట కనిపిస్తుంది. అందుకనే నా పుస్తకాల్లో సిద్ధాంతం దొరకదు. నేను ఎంత గొప్ప వాళ్ళయినా సరే వాళ్ళు చెప్పారని నమ్మను. స్వతంత్రంగా బయలుదేరతాను. ఆ యాత్రే నా పుస్తకాల్లో నాటకాలూ, కథలూ, వ్యాసాల రూపంలో వచ్చింది. సత్యం అనేది ఉంటే, బుద్ధితో కాదు. జీవితం అర్పించి, అనుష్ఠిస్తేనే కానీ, దాన్ని తెలుసుకోలేమని, నమ్మేదానికీ, చేసేదానికీ వ్యత్యాసం ఉంటే, సత్యం దొరకదనీ, ఇవన్నీ నేను నమ్మి, నమ్మింది అనుష్ఠించడం వల్ల, మీ ఆంధ్రుల నుంచి రొష్టు పడ్డాను. నా అన్వేషణ నన్ను అరుణాచలం తీసుకువచ్చింది.

ఇదేమిటో తెలుసుకుందామని నేను వెతికే సత్యం, ఆధ్యాత్మికంలో ఉందేమోనని. నేను ఇదివరకు రాసినవన్నీ ఈనాటి వరకూ సత్యమే. ఆ ప్లేన్ లో , అప్పుడు ఇంకో ప్లేన్ లో పనిచేస్తున్నాను. ఈ ప్లేన్, ఇప్పుడు ఉన్నటువంటి ప్లేన్, అప్పటి ప్లేన్ ని అబద్ధం చెయ్యదు. లోకం ఎంత సత్యమో, నా రచనలు అంత సత్యం. నా పాత రచనలు తప్పుగా

తోచిననాడు, నా సొంత డబ్బుతో నైనా సరే పత్రికల్లో "అవన్నీ అబద్ధాలు, చదవకండి"అని ఒక పేజీ అంతా, పెద్ద అక్షరాల్లో ప్రకటన చేయిస్తాను. "

ఈ మాటలు చలంగారు 1956 లో ఒక మిత్రుడికి రాసిన ఉత్తరాల్లోని వాక్యాలు. ఆయన అన్నట్లుగా "నా రచనలు చదవకండి."అని పత్రికల్లో ప్రకటన ఇచ్చే అవసరం రాలేదు. అందుకనే "శతాబ్దాల తెలుగు సాహిత్యంలో ఇంత వివాస్పదమైన, ఇంత సంచలనాత్మకమైన రచయిత మరొకరు లేరు." అని విశ్లేషకులు భావించడమే కాకుండా, చలం గారి అభిమానులు గానీ,వ్యతిరేకులు గానీ, వారి సంఖ్యనూ, వారి వారి భావాల విస్తృతినీ, తీవ్రతనూ గమనిస్తే అది 'నిజంగా నిజం' అనిపిస్తుంది. ఎంపిక చేసుకున్న అంశాలనూ, వెలిబుచ్చిన భావాలనూ, వాడిన భాషా సంపదనూ చలం గారితో పోల్చదగిన రచయిత, చలంగారు మాత్రమే అనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. అయితే, అత్యధిక శాతం సాహితీ విమర్శకులూ, అభిమానులూ చలంగారి ప్రసక్తి వచ్చినపుడు, ఎక్కువగా ఉదాహరించినపుడు, ఎక్కువగా చర్చలకు ప్రాతిపదికగా తీసుకునేవి, చలం గారు స్త్రీ, పురుష సంబంధాలను ప్రముఖంగా ప్రస్తావిస్తూ చేసిన రచనలు. ఇక్కడ ఈ కోణంలోనే, చలంగారిని అర్ధం చేసుకోవడం కంటే, ఎక్కువగా అపార్ధం చేసుకున్నారేమో అనిపిస్తుంది.

ఆయన రాసిన నవలలూ, నాటకాలూ, కథలూ, వ్యాసాలూ వీటన్నిటినీ గమనిస్తే, ఈ స్త్రీ, పురుష సంబంధాలే కాకుండా ఎన్నో విభిన్న మైన అంశాలను స్పృశించారు. కొత్త కోణాలలో ఆలోచింపజేశారు. చలంగారి ఈ భిన్నమైన కోణాలను పరిశీలించడమే ఈ భాగాల నుండి కొనసాగబోయే అంశాలు.

చలంగారు, స్త్రీ, పురుష సంబంధాలూ, స్వేచ్ఛా ప్రణయం గురించి మాత్రమే కాదు. పసిపాపల గురించీ, పిట్టల గురించీ, పువ్వుల గురించీ, సమకాలీన రాజకీయ పరిస్థితుల గురించీ, పౌరాణిక పాత్రల గురించీ బైబిలూ, సువార్తలూ, భగద్గీత ఇంకా ఎన్నెన్నో అంశాలను వ్రాశారు. క్రితం సారి చెప్పుకున్న చలంగారి లోని కరుణాంతరంగం లోని సంఘటనలకు కొనసాగింపుగా ఇప్పుడు ఆయన రాసిన "బుజ్జిగాడు"అనే పుస్తకపరిచయంతో పాటుగా, "ఓ పువ్వు పూసింది" అనే కథానికను పరిచయం చేస్తాను. ముందుగా ఈ 'బుజ్జిగాడు' పుస్తకం గురించి.

చలం గారు రమణస్థాన్ లో నివసించే రోజుల్లో, ఆయన ఆదరణ పొందిన వాళ్లలో నోరులేని మూగ జీవాలు ఎన్నో ఉన్నాయని, వాటికి పేర్లు కూడా పెట్టుకొని, సొంత కుటుంబ సభ్యుల్లో ఒక భాగంగా చూసుకునేవారనీ, లోగడ ప్రస్తావించుకున్నాం. అలాంటి నోరులేని మూగ జీవాల్లో ఒకటి, ఒక గోరింక. గాయాలతో విలవిల్లాడుతూ రోడ్డు ప్రక్కన పడివున్న ఒక గోరింక పిట్టను ఇంటికి తీసుకువచ్చి, వైద్యం చేసి, గాయాన్ని మాన్పి "మేమున్నాం"అని ధైర్యం ఇచ్చి, ఆ పిట్టకు ఎగరడం కూడా నేర్పారు. ఆ గోరింక పిట్ట సహజంగానే 2,3 నెలల తర్వాత, ఎగరడం కూడా

వచ్చింది కాబట్టి, ఎక్కడికో దూర తీరాలకు ఎగిరిపోయింది. ఈ వాస్తవ సన్నివేశాలనన్నింటినీ చలం గారు "బుజ్జిగాడు" అనే పేరుతో దిన చర్య రూపంలో అంటే, డైరీలాగ రాశారు .

అయితే, ఆ డైరీ గోరింక పిట్ట రాసినట్లు కాకుండా, ఈ సంఘటనలన్నింటినీ, ఎవరో ఒక వ్యక్తి గమనించి రాస్తున్నట్లుగా అనిపిస్తుంది. ఈ రోడ్డు పక్కన ఈ గోరింక పిట్ట ఎలాంటి పరిస్థితిలో దొరికిందంటే... చలంగారి ఇంటికి దగ్గర్లోని మైదానంలో కాకుల మూక దాడిలో, గాయపడిన ఆ గోరింక 17 జూలై 1958 వ తేదీన చలంగారి ఇంటికి వచ్చింది. సుమారు మూడు నెలల పాటు అంటే, 1958 అక్టోబర్ వరకూ వీళ్ళ ఇంట్లోనే వుంది. ఈ రెండున్నర, మూడునెలల రోజుల్లో ఆ చిన్న పిట్ట (తరువాత దానికి 'బుజ్జిగాడు' అని పేరుపెట్టుకున్నారు.) ఆ ఇంట్లో వాళ్లందరికీ ఎంత దగ్గరయ్యిందో, ఎగిరిపోయి ఎంత శూన్యాన్ని మిగిల్చిందో, ఈ పుస్తకంలో హృదయాన్ని హత్తుకునేలా చిత్రించారు చలంగారు. "అరచేతిలో ఇమిడిపోయే ఆ చిన్న పిట్ట గురించి, సుమారుగా 80 రోజుల పాటు రోజూ చెప్పే కబుర్లు ఏముంటాయి?" అనిపిస్తుంది. ఆ కబుర్లన్నీ, అందమైన కథగా అందించడమే చలంగారి ఈ రచనలోని గొప్పదనం. ఈ బుజ్జిగాడు దిన చర్యలను చిత్రించే ప్రతి వాక్యంలో, ప్రతి సన్నివేశంలో చలం గారి సున్నిత హృదయం, వారి కుటుంబ సభ్యుల్లో ఉన్న భూత దయా కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. చదువుతున్న పాఠక హృదయాలలో కూడా కరుణ రసప్లావితమే కాకుండా, ఆ గోరింకతో కలసి మనం కూడా విహరిస్తున్నట్టుగా ఉంటుంది. అసలేం రాసారో చూద్దాం.

ఈ 'బుజ్జిగాడు' గురించి రాసేటప్పుడు, ప్రతిరోజూ జరిగే సంఘటనలకు ఒక శీర్షిక ఇచ్చారు. మొట్టమొదటి రోజు జరిగిన సంఘటనకు శీర్షిక "ఏకైక వీరుడు". ఆ రోజు ఏం జరిగిందంటే... చలం గారి ఇంట్లో ఉన్న నర్తకి గారు, రోజూ భగవాన్ రమణ మహర్షి సమాధి దగ్గరకు వెళ్లి, అక్కడ ఒక పూల దండ వేసి వస్తుంటారు. త్రోవలో 'పాలీ తీర్థం' అని ఒక ప్రదేశం వుంది. ఒకరోజు అలా వెళుతుంటే,. రోడ్డు ప్రక్కన కాకులన్నీ కలసి ఏదో గోలగోలగా అరుస్తున్నాయి. నర్తకి తో పాటుగా 'కరప్పన్ ' అనే సేవకుడు కూడా ఉన్నాడు, అతన్ని " ఆ కాకుల గోలేమిటో వెళ్లి చూసారా!"అని పంపారు. ఆ కాకుల మధ్యలో ఒక చిన్న గోరింక పిట్ట చాలా అసహాయస్థితిలో, దీనంగా ఉండి కూడా, ఆ కాకులతో పోట్లాడుతోంది. ఆ కాకులన్నీ కలసి, దాన్ని పొడవడానికో, చంపి తినడానికో ప్రయత్నిస్తున్నాయి. కరప్పన్ వెళ్లి, ఆ కాకుల్ని తరిమేసి, ఆ చిన్న పిట్టను తీసుకొని, నెమ్మదిగా పట్టుకొని, నర్తకి దగ్గరకు వచ్చాడు. అప్పటికే పాపం రెక్కల క్రిందా, కంఠం క్రిందా గీసుకుపోయి ఉంది.

ఆ స్థితిలో వున్న దాన్ని, జాగ్రత్తగా ఇంటికి తీసుకువచ్చారు. ఇది వాళ్లకు కొత్తేమీ కాదు. చాలా సార్లు అలాగే పిట్టల్నీ, వాటినీ తీసుకువచ్చి, ఇంట్లో వాటికి, ఆరోగ్యం కుదిరేలా వైద్యం చేసిన తరువాత అవి ఎగిరిపోవడం అనేది

సాధారణమే. కానీ, ఈ బుజ్జిగాడు మాత్రం, అనుకుకోండా ఎక్కువ రోజులుండి, వాళ్ళు గమనించే ఎన్నో పనులు చేసాడు. అందుకని, ఈ రోజు ఈ సంఘటనతో మొదలైన ఈ కథ కొనసాగుతున్నదన్నమాట.

ఇంటికి రాగానే ఇంట్లో వాళ్ళందరూ ఈ బుజ్జి పిట్టను దగ్గరకు తీసుకున్నారు. బాగా బాధతో మూలుగుతోంది. కొన్ని పాలు పట్టారు. శోష వచ్చినట్లుగా, సొమ్మసిల్లినట్లుగా అయింది. చలంగారు కూడా చూసారు. "ఆఁ .. ఏముందిలే. ఇలాగే ఎన్నింటిని తీసుకురాలేదు. ఇది ఎంత కాలం బ్రతుకుతుంది? " అన్నారు. ఆ పిట్టని ఆ రాత్రి ఎక్కడ పెడతారు? వాళ్ళ దగ్గర పంజరం ఏమీ లేదు. "మెర్సటన్"అనే విదేశీవనిత ఉండేదని చెప్పుకున్నాం కదా! ఆవిడ ఇనప చువ్వలు వున్న కప్ బోర్డు ఇచ్చింది. అందులో పెట్టారు. మత్తుగా పడుకొని వుంది. ఆ పిట్టకి ఆకలి అవుతుందని, ఆ రాత్రంతా మేలుకొని, ప్రతి మూడు గంటలకూ పాలు పట్టడం ప్రారంభించారు. అదీ చలంగారికీ, వాళ్ళ కుటుంబ సభ్యులకే ఉన్న జాలీ, దయా, కరుణా .

తెల్లవారింది. చలంగారు తెల్లవారు జామునే లేస్తారు. ఆ కప్ బోర్డు దగ్గరకు వెళ్లి చూసారు "వుందా? చనిపోయిందా?" అని. ఆ గోరింక అలా పడుకొని, కళ్ళు తెరచుకొని చూస్తూ వుంది. బాగానే వుంది అనుకున్నారు. తెల్లారేక సౌరీస్ గారు దానికి మళ్ళీ పాలు పట్టించారు. ఉత్తి పాలతో ఎంతకాలం బ్రతుకుతుంది అనుకుని, రొట్టె ముక్క పాలల్లో కలిపి ముద్దగా చేసి పెట్టారు. అది కూడా తిన్నది. "అయితే, అసలు ఆహారం ఏమిటో తెలిస్తే గానీ, దాన్ని పెంచలేం"అనుకున్నారు. గతంలో వాళ్ళు షికారుకు వెళ్ళినపుడు, గోరింకలన్నీ, గాలిలో ఎగిరే వుసుళ్లను తినడం గమనించారు. అది గుర్తుకు వచ్చింది. ఉసుళ్ళు అంటే, చెదపురుగులే వర్షం పడినపుడు రెక్కలు వచ్చి ఎగురుతాయి. వాటిని తింటుంటాయి గోరింకలు. ఇంటి పక్కన ఎక్కడైనా చెదలు ఉంటాయేమోనని చూశారు. ఎక్కువ వెదకాల్సిన అవసరం రాలేదు. ఎందుకంటే, వీళ్ళ ఇల్లు వూరికి దూరంగా వుంది. పైగా అడవి. అందుకని ఎక్కడబడితే, అక్కడ చెదలు ఉండేవి. ఆ చెదల్ని తీసుకువచ్చి, వాటిని ముద్దగా చేసి, ఈ గోరింకపిట్ట ముక్కు దగ్గర పెట్టారు. అది కొంచెం కొంచెంగా తినడం మొదలుపెట్టింది. అయితే, దానికి కావలసిన అసలైన భోజనం చెదలు అని వాళ్లకు రూఢీ అయింది.

ఇది రెండో రోజు. మొదటి రోజు ఈ గోరింకను తీసుకువచ్చిన కరప్పన్ "ఏమైంది?" అని అడిగాడు. ఇదిగో "దానికి చెదలు పెడుతున్నాం"అనగానే, "ఎంత కాలం బతుకుతుంది ఆ పిట్ట? దాని కోసం చెదలన్నిటినీ చంపుతారా?"అన్నాడు.

వాళ్ళ ఇంటికి ఎదురుగా ఒక గుడిసెలో అన్నామలై అని ఒకతను ఉండేవాడు. అతను ఆశగా ఎదురు చూస్తున్నాడు "ఈ పిట్ట ఎప్పుడు చనిపోతుందా, కోసుకుతిందామా?" అని. చలంగారి పరివారం మాత్రం జాగ్రత్తగా ఆ పిట్టని, చెదలు పెట్టి, జాగ్రత్తగా చూస్తున్నారు.. రెండో రోజుకూడా దెబ్బలు మానలేదు. అందుకని మత్తుగా

నిద్రపోతున్నాడు. "వున్నాడు"అనే రాస్తారు చలం గారు. అయితే, రెక్కల క్రిందా, మెడక్రిందా ఉన్న గాయాలకు మందులు రాసారు. అది భరించలేక ముక్కుతో కెలుక్కోవడం ప్రారంభించింది. ఆ మరుచటి రోజు, మత్తు వదలి, కొంచెం బయటకు రావడానికని ఆ ఇనప చువ్వలను పొడవడం మొదలుపెట్టింది. మరి వదిలేస్తే, ఎగరగలదో, లేదో అనుకొని, దాన్ని ఆ కప్ బోర్డు లోనే ఉంచారు. కానీ అలా ముక్కుతో కొడుతుండేసరికి, ముక్కు వెంబడి రక్తం కూడా రావడం మొదలయ్యింది.

అందుకని, దాంట్లోనుండి బయటకు తీసి, కాలుకి దారం కట్టి, ఇంట్లో మాత్రం వదలడం మొదలు పెట్టారు. "ఇది ఎగురుతుందేమో చూద్దాం, ఎగిరితే వదిలేద్దాం" అని బయటకు తీసుకెళ్లి వదిలారు. అది ఒక కొమ్మ మీద నుండి, మరొక కొమ్మ మీదకి ఎగరడమే తప్ప అంతకుమించి ఎగరలేక పోతోంది. "దీనికి ఎగరడం రాదు గాబట్టి, ఎగరడం లేదు. దీన్ని ఇప్పుడు వదిలేస్తే, ఏ కాకులో, గద్దలో తింటాయి. అందుకని కొన్ని రోజులు మనమే సాకుదాం" అనుకున్నారు.

ఇంట్లో అటూ, ఇటూ తిరుగుతుండేది. చిన్న స్టవ్ మీద కూర్చొని, అక్కడకు తీసుకొచ్చి పెడితేనే, ఆహారం తినేది. కాలుకి దారం కట్టి వాళ్ళతో పాటు షికారుకు తీసుకెళ్లేవారు. పోనీ, దాని అమ్మా, నాన్నలు ఉన్నారేమో, అవి వచ్చి తీసుకువెళతారేమోనని, ఆ మైదానంలో ఆ దారం తోటే వదిలేశారు. అక్కడకు ఏ పిట్టలూ రాలేదు. ఇదొక్కటే మునీశ్వరుడి లాగ కూర్చొని వుంది. "సరే! ఇది ఎక్కడకూ వెళ్లదు."అనుకోని మళ్ళీ వెనక్కి తీసుకొచ్చారు.

వెనక్కి తీసుకొచ్చిన దగ్గర నుండి చలంగారి మూడవ అమ్మాయి పకపక ఆ పక్షిని 'బుజ్జిగా' అని పిలవడం మొదలుపెట్టింది. అక్కడ నుండి ఆ చిన్న గోరింక పేరు "బుజ్జిగాడు"అయ్యింది. పకపకే దానికి ఇంచార్జ్ అన్నట్లుగా, భోజనం పెట్టడం గానీ, జాగ్రత్తగా బయటకు తీసుకువెళ్లడం, మళ్ళీ లోపల పెట్టడం.. ఇవన్నీ చేస్తుండేది. ఇంట్లో వాళ్లందరికీ కూడా బాగా దగ్గరయింది. షికారుకు తీసుకువెళ్ళినపుడు, మరీ చేతులతో తీసుకువెళితే, సున్నితంగా ఉంటుందని, ఒక తీగల బుట్టలో పెట్టి తీసుకువెళ్ళేవారు. ఓ రోజు అలా వెళ్ళినపుడు రోడ్డు ప్రక్కన చెదలు ఉంటే, అక్కడ వదిలారు. అది చూసింది గానీ, తినలేదు. వీళ్ళు వెళ్లి దాని ముక్కు వంచి, చెదలు చూపిస్తే,అప్పుడు కొంచెం తినడం మొదలు పెట్టింది. "ఓహో! దీనికి చెదలు చూపిస్తేనే గానీ, తినదు. " అనుకున్నారు. అక్కడి నుండి షికారుకు వెళ్ళినపుడల్లా దానికి చెదలు తినడం అలవాటు చేశారు. అలా వెళుతున్నప్పుడు అక్కడ రాళ్ళూ, రప్పలూ వాటి మధ్యలో నీళ్లు ఉన్నాయి. ఆ నీళ్ళలోకి వెళ్లి, రెక్కలు టపా టపా కొట్టుకోవడం మొదలు పెట్టింది. అంటే, అది స్నానం చెయ్యడం లాంటిది. మరోసారి వెళ్ళినపుడు అక్కడ నీళ్లు లేకపోతే, వీళ్ళే నీళ్లు పోశారు. అందులో స్నానం చేసింది.

ఇవన్నీ కూడా మనకు చూస్తే, ఏం అనిపించదు. ఏదో పిట్ట వుంది. పెరుగుతోంది. అనుకుంటారు. కానీ, చలం గారు చూసిన దృష్టి, ఆయన రాసిన విధానం.. ఈ సంఘటనలన్నీ ఒక సస్పెన్స్ సినిమా చూసినట్టుగా అనిపిస్తుంది.

ఒక్కొక్క అధ్యాయం చదువుతుంటే “ఇలా ఎన్నాళ్ళు ఉంటుంది? ఎన్ని పనులు చేస్తుంది?” అన్న ఆసక్తి కలుగుతుంది పాఠకులకు. సరే! దానికి తినడం నేర్పారు. స్నానం చెయ్యడం నేర్పారు. ఇంక ఎగరడం నేర్పాలి. ఇలా షికారుకు తీసుకువెళ్ళినపుడు, కాలుకి ఎలాగూ దారం కట్టి వుంది కాబట్టి, దూరంగా నిలుచుని, ఒకరి దగ్గరకు ఒకరు విసరడం, అంటే, అభ్యాసం మొదలు పెట్టారు. ఆ విధంగా 2,3 రోజులు చేశారు. వీళ్ళ ప్రాక్టీస్ వలన, పది రోజులకి కాస్త ఎగరడం అలవాటు అయ్యింది. ఆ చుట్టు పక్కల వాళ్ళూ, అటూ, ఇటూ వెళ్ళేవాళ్ళూ ఆశ్చర్యంగా చూస్తూండేవారు. అందరూ మాట్లాడుకోవడం మొదలు పెట్టారు. మొత్తానికి ఎలాగైతేనేం ఎగరడం వచ్చింది. ఇంట్లోకి తీసుకువచ్చారు. దారం అయితే, అలాగే ఉంచారు.

ఒక రోజు పొద్దున్నే ఆ కప్ బోర్డు లోనుండి బయటకు తీశారు. అక్కడే తిరుగుంది కదా, పాలు పడదామని అనుకున్నారు. చలంగారు తెల్లవారు జామునే లేచి, ఆవూ, దూడ దగ్గరకు వెళ్లారు. ఇంతలో బుజ్జిగాడు బయటకు ఎగిరిపోయింది. అందరూ చాలా కంగారు పడ్డారు. ఎందుకంటే, దాని కాలుకి దారం వుంది. ఆ దారం తో ఎగిరింది కాబట్టి, ఎక్కడైనా కొమ్మల్లో చిక్కు పడిపోతుందేమో, అక్కడే ఉండిపోతే, కాకులూ, గద్దలూ వస్తాయేమో నని అందరూ తలో దిక్కూ పరిగెట్టి, వెతకడం మొదలు పెట్టారు. “బుజ్జిగా... బుజ్జిగా ...” అంటూ గట్టిగా పిలిచారు. మొత్తానికి ఒక కొమ్మ మీద వీళ్ళు అనుకున్నట్టుగానే దారం చిక్కుబడి పోయి, “కిచ...కిచ... “మంటూ అరుస్తోంది. అక్కడ నుండి తీసుకువచ్చేశారు.

ఆ రోజు నుంచీ ఎగరడం వచ్చింది గాబట్టి రెండు, మూడు సార్లు ఎగిరిపోయింది. ఒకసారేమో కాకులన్నీ తరుముకు వస్తుంటే, వెనక్కి వచ్చేసింది. ఇంకోసారి ఒక గద్ద తరుముతుంటే వచ్చేసింది. ఈ అనుభవాలతో భయపడ్డాడేమో గానీ, దూరంగా వెళ్లడం మానేశాడు. ఇంటి దగ్గరే ఉండేవాడు. ఇంటి చుట్టుపక్కల చెట్లు ఉండేవి. ఆ కొమ్మల మీద కాసేపు ఉండి, తరువాత ఇంట్లోకి వచ్చేసేవాడు. వాళ్ళు పిలుస్తుంటే, సమాధానం ఇచ్చేవాడు. “బుజ్జిగా...!రా...రా... “ అంటే, “కిచ...కిచ.. “ మంటూ అరిచేవాడు. ఒకసారి చెట్టు మీద ఉంటే, మరో రెండు గోరింకలు వాలాయి. వాటితో కాసేపు మాట్లాడాడు. ఆ రెండూ వెళ్లిపోయాయి.

చలంగారు ఈ సన్నివేశాన్ని ఏమని రాశారంటే... ”బహుశా అమ్మా, నాన్నా వచ్చి ఉంటాయి. ఏం రా! బుజ్జిగా నువ్విక్కడ వున్నావా? రా! మాతో వచ్చేయ్!”అని అడగడానికి వచ్చి ఉంటాయి. అప్పుడు మన బుజ్జిగాడేమో

"ఇన్ని రోజుల తర్వాత గుర్తొచ్చానా మీకు. మీరు వెళ్లిపోండి. వీళ్ళు నన్ను బాగా చూసుకుంటున్నారు. వీళ్లతోనే వుంటాను. అని చెప్పేసి, పంపించాడు "అని.

మొత్తానికి ఇంత గారాబంగా చూసుకున్న ఆ బుజ్జిగాడు ఇంట్లో ఎలాంటి పనులు చేసేవాడంటే, ఈ స్టవ్ మీద కూర్చొని తినడం అయిపోయాక, కొన్ని రోజులకి పీట మీద కూర్చునేవాడు. ఆ పీట మీద పెడితేనే, ఆ చెదలుగానీ, రొట్టెముక్క గానీ తినేవాడు. రోజూ సౌరీస్ గారు ఆశ్రమం లోకి వచ్చిన వాళ్లందరికీ ఇంగ్లీష్ నవలలు చదివి, వినిపించేవారు. ఈ బుజ్జిగాడు అవి కూడా శ్రద్ధగా వింటుండేవాడు. ఆశ్చర్యం ఏమిటంటే,మరి ఎలా తెలుస్తుందో ఏమిటో గానీ, ఆవిడ షేక్స్పియర్ నాటకాలు చదివినపుడు మాత్రం చాలా జాగ్రత్తగా వినేవాడు. మిగతావి చదివేటప్పుడు దూరంగా వెళ్లిపోయేవాడు. చలంగారు ఈ బుజ్జిగాడిని పెంచే రోజుల్లో, రోజూ సాయంకాలం పూట నాలుగూ, నాలుగున్నర వరకూ చుట్టు పక్కల వాళ్లందరినీ కూర్చోబెట్టుకొని వాళ్లకి "బుజ్జిగాడు"కబుర్లు తను రాసినవి వినిపిస్తుండేవారు. ముందు రోజు జరిగినవి గానీ, ఆ రోజు జరిగినవి గాని. అవన్నీ కూడా శ్రద్ధగా వింటుండేవాడు. ఇంట్లో వాళ్ళందరి భుజాల మీదా వాలడం, అక్కడ నుండి మరో చోట వాలడం ఇలాంటి పనులన్నీ చేసేవాడు.

ఒక రోజు ఇంకొక గోరింక వచ్చింది. రెండూ చాలా సేపు కబుర్లు చెప్పుకున్నాయి. చలంగారు అన్నారు "బహుశా ప్రేయసో, ప్రియుడో అయ్యుంటాడు" అని. ఎందుకంటే, వీళ్ళ ఇంట్లో వున్న గోరింక ఆడో, మగో తెలీదు. కాసేపు ఉండి ఆ గోరింక వెళ్ళిపోయింది. బహుశా ఏం మాట్లాడుకొని ఉంటాయి "ఈ ఇంట్లో వీళ్ళు నన్ను బాగా చూసుకుంటున్నారు. నువ్వు కూడా వచ్చేయ్! నిన్ను కూడా బాగా చూసుకుంటారు. "అని బుజ్జిగాడు ఆ రెండో గోరింకను పిలిచి ఉంటాడు.

కానీ, ఆ రెండో గోరింక "మనుషులను నమ్మకూడదు. అమాయకంగా నమ్ముతున్నావు. నేను మాత్రం నమ్మను. " అని ఎగిరిపోయింది. ఇదంతా, చలంగారు ఊహించారు. ఇలా వీళ్ళ ఇంట్లో ఉంటూ మధ్య మధ్యలో ఆ చెట్ల మీద వెళ్తూ, వీళ్ళు పిలిచినప్పుడల్లా లోనికి వస్తుండేవాడు. కొన్ని రోజులకు వీళ్ళు ఏం గమనించారంటే, "సన్నగా వున్నాడు. పెరగడం లేదు." అని, ఆ బుజ్జిగాడికి "షార్క్ లివర్ "ఆయిల్ ఇవ్వడం మొదలుపెట్టారు. అప్పుడు కాస్త ఒళ్ళు చేశాడు.

ఒక రోజు చాలా విచిత్రమైన సంఘటన ఏం జరిగిందంటే, చలం గారు సాయంకాలం పూట అభిమానుల దగ్గరనుండి వచ్చిన ఉత్తరాలు చదువుతున్నారు. అన్ని ఉత్తరాలూ అలా వింటున్నాడు బుజ్జిగాడు.

వాటిలో శ్రీనివాసరావు అనే ఒకతను రాసినటు వంటి వుత్తరం సగభాగం చదివేసరికి, చలంగారి చేతిని ముక్కుతో పొడిచి, ఆ ఉత్తరాన్ని లాగి దూరంగా విసిరేసాడు. ఏమిటి ఇలా చేసాడు అని, చలం గారు మళ్ళీ చదవడం మొదలు పెట్టారు. మళ్ళీ రెండు లైన్లు చదవగానే మళ్ళీ తీసుకొని పక్కన పడేసాడు. చలం గారికి ఆశ్చర్యం వేసింది.

ఈ చిన్న గోరింక పిట్టకు ఏం తెలుస్తోంది? ఆ శ్రీనివాసరావుకు రాయవద్దనా? ఆ శ్రీనివాసరావు, నా మీద కోపంగా రాశాడనా? లేకపోతె శ్రీనివాసరావు వ్యక్తిత్వం ఈ ఉత్తరంలో వుంది కాబట్టి, అది తనకి నచ్చలేదా? ఇన్ని ఆలోచనల్లో పడ్డారాయన. మొత్తానికి రెండు నెలలు జూలై నుండి సెప్టెంబర్ చివరి వరకూ గడిచాయి. ఈ లోగా పిట్టలు అమ్మేవాడు వస్తే,ఇంట్లో పెంచుకోవడానికి రెండు కవుజు పిట్టలు కూడా కొన్నారు.

అవి కొనేసరికి బుజ్జిగాడికి కొంచెం అసూయ వచ్చింది. తనని కాకుండా మరో రెండు పిట్టల్ని కూడా చూస్తున్నారా? అక్టోబర్ మొదటి వారం వచ్చింది. రెండు మూడుసార్లు దూరంగా వెళ్లిపోవడం, వెళ్ళిపోయి, మళ్ళీ, వెనక్కి వచ్చి, ఆ చూరులో కూర్చొని, యెంత పిలిచినా రాకపోవడం, ఇలాంటి పనులు మొదలు పెట్టాడు. ఇంట్లో వాళ్ళకి అర్థం కాలేదు. “ఎందుకిలా చేస్తున్నాడు? ఇంత వరకూ బాగానే వున్నాడు కదా!”అనుకున్నారు. ఒక రోజు 1958 అక్టోబర్ 5 వతేది. రోజూ బ్రతిమిలాడించు కునేవాడల్లా, ఆ రోజు గబగబా ఇంట్లోకి వచ్చి, పకపక గారి ఒళ్ళో కూర్చొని, ఆవిడ ఒళ్ళంతా తడిమి, ముఖం మీద కూడా రాసి. ఎగిరిపోయాడు. అంతే ... ఆ ఎగిరిపోవడం... ఎగిరిపోవడం.. మళ్ళీ ఇంట్లోకి రాలేదు.

ఆ తరువాత 2,3 సార్లు ఆ చెట్ల మీద కూర్చునేవాడు. ఇంటి వైపు మాత్రం చూసేవాడు కాదు. అదీ.. ఆ రెండున్నర నెలలూ వాళ్ళ ఉండి , ఎగిరిపోయిన సందర్భం. అయితే, ఎందుకు వెళ్లిపోయాడో మాత్రం వీళ్ళకి అర్థం కాలేదు. బహుశా, ఆ పిట్టా మెదడులో మానవ సంబంధాల గురించి ఉన్న జ్ఞాపకాలు చెదిరి పోయాయా? లేకపోతే గుడ్లు పెట్టే సమయమా?నిజంగా వాళ్ళ అమ్మా, నాన్నా కనిపించి తీసుకువెళ్లిపోయారా? లేకపోతే పెంచుకోవడానికి తెచ్చిన కౌజు పిట్టల్ని చూసి, అసూయ తో వెళ్లిపోయాడా? ఏదీ ఏమైనా గాని, ఆ బుజ్జిగాడు ఎగిరిపోవడంతో, రమణ స్థాన్ లో భర్తీ చేయలేనటువంటి శున్యం ఆవరించింది. వాళ్లంతా ఎంతో దిగులు పడ్డారు.

ఈ “బుజ్జిగాడు” గురించి చలంగారు 100 పేజీలకథ. ఒక సస్పెన్సు నవల చదువుతున్నట్టుగా ఉంటుంది. ఆ పుస్తకానికి చివరి మాట హృదయాన్ని కదిలించేలా రాశారు. ఆ చివరి మాటలోని కొన్ని వాక్యాలు... “ నిన్ను గురించి కథ రాయాలని వుంది. చాలా కాలం నుండి. నా మెదడు అడుగు పొరల్లో మెదులుతూనే వుంది. నిన్ను గురించి ఏం కథను రాయను బుజ్జి? ఏం రాస్తే, వీళ్లకు అర్థమవుతుంది? వాస్తవాన్నే రాసినా, వీళ్ళు నమ్మతారా బుజ్జి? మనుషులు వీళ్ళు. నిన్ను గురించి రాస్తే, ఎవరు చదువుతారు బుజ్జి. ఎండిపోయిన హృదయాలకు, నీ హృదయ ఔన్నత్యం ఎట్లా అవగాహన అవుతుంది? ఈ మనుషులు ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు పుట్టేరంటేనో, పుటకతోటే కవల పిల్లలు కలసి వున్నారంటేనో చదువుతారు గానీ, నీ అమ్మ వెంబడి, పాపాయి వలే గెంతుతూ నడుస్తావంటే, ఆశ్రమానికి వెళ్లకుండా అడ్డు తగులుతావంటే, ఏ చెట్లలోనో నువ్వు ఉంటే, మీ అమ్మ నిన్ను “బుజ్జి “అని పిలిస్తే, నువ్వు పలుకుతావంటే, నీళ్లు పెడితే, స్నానం చేస్తూ ఉంటావంటే, మంచి పాటలు పెట్టమని రేడియోని పొడుస్తావంటే,

ఆశాభోంస్లే పాటలే  వింటూ, వాటితో పాటు పాడుతూ వుంటా వంటే, ఏ రకపు చెదపురుగులు  తినాలో నువ్వే చెబుతావంటే, ఎవరు వింటారు బుజ్జి? విన్నా ఎవరు విశ్వసిస్తారు? ఈ మనుషుల్లో రసికత్వం ఉందట. వీళ్ళవి కళా హృదయాలట. అందాన్ని చూస్తే, వీళ్ళ డెందం నిలవదట. అవన్నీ చచ్చు కబుర్లు బుజ్జి.

ముత్యాల్లాంటి చెదలు నువ్వు తింటుంటే, ఎంత అందంగా ఉంటుందో, త్వర త్వరగా నోటినిండా కుక్కుకుని తినే మనుషులకు ఎట్లా తెలుస్తుంది. ఒక్క అక్షరం వీళ్ళకి అర్ధమవుతుందా?ఇన్ని డిగ్రీలు పాసయినా  ఠాగూర్ అర్ధమయ్యాడా బుజ్జి. నువ్వేమీ చదువుకోకుండానే యెంత బాగా అర్థం చేసుకున్నావు. ఠాగూర్ గీతాలకి నోబెల్ ప్రయిజ్ వచ్చిందని గొప్పలు చెప్పుకుంటారు గానీ, గీతాంజలి లోని మాధుర్యం వీళ్ళేం ఆస్వాదించారు. గీతాంజలి నేను చదువుతుంటే, విని యెంత ఆనందిస్తావు బుజ్జి? ఏ గొప్ప కవిత్వాన్ని వినిపించినా, నీ అంత ఆనందం వీళ్లకు రాదు కదా! కవిత్వాన్ని కాలక్షేపానికి చదవడమే గానీ, నీలాగ దానిలో లీనమయ్యేటటు వంటి కవితా హృదయం వీళ్లకు ఎక్కడుంది బుజ్జి?

అయినా, నువ్వేమయినా ప్రసిద్ధ ఆంధ్ర కధానాయకుడివా? ప్రియురాలి మెల్ల మీద కవిత్వాలు రాసి, షష్ఠి పూర్తి మహోత్సవం జరుపుకున్న కవి కులతిలకానివా? కెమెరా చూసి ఫోటో తియ్యమని నువ్వొచ్చి నిలబడినప్పుడు, డబ్బులూ, అవీ గుర్తుంటాయా బుజ్జి? వీళ్ళందరూ అనుకుంటారు. నేనేదో పిచ్చివాడినని. నీకోసం రాస్తున్నాను. ఫోటోలు తీస్తున్నాను అని. కానీ, నీ మీద ఉన్న ప్రేమ వాళ్లకి ఏం అర్ధమవుతుంది?  నేను కూడా ఇలా మనుషుల మధ్య బ్రతికిన రోజుల్లో నాలోని మానవత్వం నాశనం అయ్యి, నన్ను, నమ్మి నా చేతుల్లోకి వచ్చిన పిట్టల్నీ, కోళ్ళనీ దగ్గరుండి గొంతు కోయించి అవి చనిపోతుంటే, ఆ బాధను సహించలేక, దీనంగా ఏడుస్తుంటే, విని సంతోషించే రాక్షసత్వం నాలో వున్నా, నన్ను నీ సేవకుడిగా అంగీకరించి ప్రేమిస్తున్నావంటే, నీలో యెంత దయ వుందో కదా! బుజ్జి? నువ్వు ఆకాశంలో నుండి పడిపోతావనే భయంతో, నీ శక్తి నంతా నీ రెక్కల్లోకి తీసుకొని గిల గిలా కొట్టుకుంటుంటే, నువ్వు ఎగరడం నేర్చుకుంటున్నావని, ఇదంతా మరచిపోయి, నన్ను ప్రేమిస్తున్నావంటే యెంత మార్దవమైన హృదయమో కదా! బుజ్జి?

నాలోని మూర్ఖత్వాన్ని, రాక్షత్వాన్ని కర్కశత్వాన్ని క్రమంగా పోగొట్టుతూ నన్ను ప్రసూనంగా వికసింప జేస్తున్నావు బుజ్జి. చూడలేము అనే ఈ మానవుల గాజు కళ్ళకు, నీ రసమయ కళా ఖండాలు ఎలా చూపిస్తాను బుజ్జి. 'వినము' అనే ఈ మానవుల లీనులకు, నీ గాంధర్వాన్ని ఎలా వినిపించను బుజ్జి. నిన్ను గురించి ఏం కథ రాయను బుజ్జి?"  ఇవి ఆయన చిట్టచివరలో రాసిన వాక్యాలు.

చలంగారి గురించి ఒక అభిమాని అన్నారు "చలం గారు కొట్టి దెబ్బల గురించి మాట్లాడుతారు గానీ, పాడిన పాటల గురించి ఎవరూ మాట్లాడరు "

ఇదిగో చలం గారి జాలి గుండె రాసిన పాట ఈ 'బుజ్జిగాడు' అనే పుస్తకం.

★★★

తర్వాత పువ్వుల గురించి రాసిన ఒక కథను పరిచయం చేస్తాను. ఈ కథ పేరు ''ఓ పువ్వు పూసింది''. పువ్వు జీవితకాలం యెంత ఒక రోజు. మహా అయితే, కొద్ది రోజులు. అడవిలో పూసిన ఒక పువ్వు కథ ఇది. పువ్వు గురించి కథ రాయడానికి ఏం ఉంటుంది? మొగ్గగా పుడుతుంది. పువ్వుగా వికసిస్తుంది. దాంట్లోకి మకరందం చేరుతుంది. ఏ తుమ్మెదో వచ్చి పీలుస్తుంది. సాయంత్రం అయ్యేసరికి రేకలు ఒడలిపోతాయి. రాలి పోతుంది. ఇంతే కదా! దాంట్లో కథ రాయడానికి ఏం ఉంటుంది? అని మనకి అనిపిస్తుంది. మామూలు కళ్ళతో చూస్తాం కాబట్టి, మామూలు మనసుతో ఆలోచిస్తాం కాబట్టి. ఇవే సంఘటనలన్ని, అద్భుతమైన లఘు కావ్యం లాగ ఆరు పేజీల కథానిక లాగ ఒక విధంగా చూస్తే స్కెచ్ లాగ వ్రాశారు చలం.

చలంగారి సాహిత్యాన్ని సమీక్ష చేస్తున్నప్పుడు, చలంగారి గురించి మాట్లాడుతున్నప్పుడు " ఓ పువ్వు పూసింది' ప్రసక్తి రాకుండా ఆ చర్చ గానీ, సమీక్ష గానీ, సమగ్రం కాదు." అని విశ్లేషకులు భావిస్తూవుంటారు. అలాగే జరుగుతుంది కూడా. ఈ "ఓ పువ్వు పూసింది"అనే కథానిక "భారతి"మాస పత్రిక రజతోత్సవ సంచికలో వచ్చింది. దీని నేపధ్యం ఏమిటంటే – చలంగారు 1921 నుండి కథలూ, నవలలూ రాస్తుంటే, ప్రముఖ పత్రికలేవి ముందుకు వచ్చేవి కావు. అయితే, ప్రచురించిన పత్రికలకు మాత్రం అమ్మకాలు బాగా ఉండేవి. అలాగే ఆ పత్రికల్ని బెదిరించే వాళ్ళు కూడా ఉండేవారు. "భారతి"పత్రికకైతే, చలంగారి రచనలను దగ్గరకే రానిచ్చేది కాదు. అలాంటిది భారతి పత్రిక ప్రారంభించిన 25 ఏళ్ళకి రజతోత్సవ సంచిక వేస్తూ చలం గారిని కథ రాసి ఇవ్వమని అడిగారు "ఇంత కాలం గుర్తుకు రాని వాడిని. ఇప్పుడు గుర్తుకు వచ్చానా?" అన్నారు. ఎలాగో బ్రతిమిలాడి రాయించుకున్నారు. అలా వచ్చింది ఈ "ఓ పువ్వు పూసింది" కథానిక 1949లో. అప్పటికి చలం గారి పరిస్థితి ఎలా వుందో గతంలో తెలుసుకున్నాం. మళ్ళీ ఒక్కసారి క్లుప్తంగా గుర్తుతెచ్చుకుందాం, అప్పటికి వదిన రంగనాయకమ్మ గారు చనిపోయారు. భార్య రంగనాయకమ్మ గారు అరుణాచలం వెళ్లిపోయారు. "ఐదారుగురు ఆడపిల్లలతో బెజవాడలో ఉండాలా, వెళ్లిపోవాలా, వెళితే ఎక్కడకు వెళ్ళాలి?" ఇలాంటి సందిగ్ధ, సంక్లిష్టమైన పరిస్థితిలో ఉండగా చలంగారు రాసిన అద్భుతమైన కావ్యం లాంటి కథ ఈ "ఓ పువ్వు పూసింది"

ఈ మొత్తం కథ చదివాక చలం గారి మనః స్థితి ఊహించుకోండి. అప్పట్లో అలా ఉండి కూడా ఇలాంటి కథ ఎలా రాశారు,అని ఆశ్చర్యం కలగక మానదు. ఇక కథలోకి వెళదాం.

ఓ పువ్వు పూసింది (కధానిక )

అర్ధరాత్రి అడవిలో పువ్వు పూసింది. చుట్టూ చీకటిని చూసి భయం వేసి "అమ్మా"అని ఏడ్చింది. ఆకులూ, తొడిమెలూ దగ్గరకు తీసుకొని "భయం లేదని"పూయించాయి ఆ తెల్లని పసి పువ్వుని. (నేను కధలోని వాక్యాలు అక్కడక్కడ కోట్ చేస్తూ మీకు 'నెరేట్' చేస్తాను. ఆ వాక్యాలు చదవక పోతే ఈ కధలోని సున్నితత్వం అర్ధం కాదు) అలా మొగ్గగా వచ్చింది పువ్వు. ఆ పువ్వుకి తల్లి ఎవరు?తండ్రి ఎవరు?కొమ్మ తల్లి లాంటిది. అందుకని ఆ మొగ్గ, ఆ తల్లిని అడిగిందట "అమ్మా! ఎవరు తీసుకొచ్చారు నన్నిక్కడకి?" అని.

తల్లి అంది. " ఎవరు తీసుకొస్తారు. నేనే తెచుకొన్నాను నిన్ను. నా గారాబాన్ని, నా బంగారాన్ని, నా ముద్దుల మురిపాన్ని"

"అమ్మా! నువ్వెంత అందంగా ఉంటావు. ఒక్కసారి చూడాలని ఉందమ్మా"అని అడిగింది ఆ మొగ్గ.

"తెల్లారనీ చూద్దువుగాని, ఇప్పుడు పడుకో "అంది ఆ తల్లి.

"భయం వేస్తుందమ్మా. కింద పడిపోతానా?"అంటే, "నేను పట్టుకుంటాను కదా! " (కొమ్మకే ఉంటుంది కదా! పువ్వు. అందుకని అలా అంది ) మరి పాప పుట్టగానే దానికి ఆహారం కావాలి కదా! ఆ పువ్వు నోటికి వెచ్చగా, తియ్యగా, ఒంటినంతా సంతోషం నింపుతూ పాలు వచ్చాయి. "వచ్చావా?"అని ఒళ్ళో పెట్టుకుని, ఊగించింది గాలి. అలా మొదలైంది ఆ పువ్వు జీవితం.

తెల్లవారే వరకూ తల్లితో కబుర్లు చెబుతూ వుంది. , కొమ్మ తన కూతురికి లోకాన్ని పరిచయం చేస్తూ, కూతురు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెబుతోంది. "యెంత అందంగా వున్నావమ్మా?"అంది తల్లిని చూసి, "అమ్మా! ఎవరినమ్మా కావిలించుకొని అల్లుకున్నావు? అతనెవరు?అట్లా గంభీరంగా నిలుచున్నాడు. నీ బరువును మోస్తూ"అంటే,

"అతడు మీ నాన్న" అంది కొమ్మ.

"అమ్మా! అట్లా కిచకిచ మంటూ వస్తున్నారు"అంది పువ్వు. (ఒక కోతి వచ్చింది. ఒక పాము వచ్చింది.)

"అది ఎవరు?" అంది ఇంకా మొగ్గగా వున్న పువ్వు. తల్లి వాటికీ సమాధానం చెప్పింది. దూరంగా కోయిల కూస్తోంది. "అమ్మా! ఎవరు అలా కూస్తోంది. "అని అడిగింది. "దాన్ని కోయిల"అంటారు. "ఎందుకు కూస్తోంది?" ప్రియుడి కోసం"

"మరి రాడా ?"

"చీకటిగా వుంది కదా! అందుకని రాలేదు."

" మళ్ళీ పిలవమను. " "పిలుస్తుంది లే!"

ఇలా తల్లీ కూతుర్లు కబుర్లు చెప్పుకుంటుండగా, తెల్లవారింది. తెల్లవారేసరికి ఎలా ఉంటుంది ఉదయం. పుత్సవాలూ, వాయిద్యాలూ, అరుపులూ, సంతోషాలూ, పూడుస్తున్నారు. తోరణాలు కడుతున్నారు. జయజయధ్వానాలు చేస్తున్నారు. కాంతి... కాంతి ... ప్రపంచమంతా కాంతి. ఆకాశమంతా ఆనందాన్ని నింపుతోంది కాంతి. అలల మల్లే కాంతి విరుచుకుపడుతోంది కాంతి లోకం మీద. తెల్లవారింది.

తెల్లవారేసరికి, మొగ్గగా వున్న పువ్వు కొంచెం కొంచెంగా విచ్చుకోవడం ప్రారంభమయ్యింది. అంటే, పసిపాపగా ఉన్న పువ్వు కన్యగా మారుతోంది. ఆ సమయంలో సూర్యుడి కిరణం, ఆ పువ్వును తాకింది. ఎలా ఉందంటే అది – *సమస్తమూ మరచి, కళ్ళు తెరచుకొని చూస్తూ వున్న పువ్వు వైపు ఒక కిరణాన్ని విసిరాడు సూర్యుడు. అప్పటికి తెలిసింది. ఇప్పుడు నేను పసిపాపను కాదు. కన్యనయ్యాను అని. తనలోకి ఆ లేత ఎండా , వెన్నెలా, కింద గడ్డీ, ఆకాశంలోని నీలపు నునుపు, తన తండ్రి కొమ్మల బలం. కోయిల కంఠం లోని జాలి. గాలిలోని అర్ధంలేని అల్లరి. తన తల్లి వేర్ల క్రింద భూమిలోని అనర్గళ సారం. అన్నీ ప్రవహించాయి. అంటే, ఆ పువ్వులోకి తేనే బిందువుల లాంటివి వచ్చి కూర్చున్నాయి.*

తెల్లవారింది. కొంచెం పొద్దు పైకి వెళుతోంది. ఎవరో ఒకతను ఒళ్ళంతా పూల రజను జల్లుకొని, మిత్రులతో కలసి వెళుతున్నాడు. తల్లిని అడిగింది పువ్వు, ఇప్పటికి మొగ్గ పువ్వుగా మారిపోయింది

. " అమ్మా! ఎవరతను హడావుడిగా పరిగెత్తుతున్నాడు. ఒళ్ళంతా పూల రజను వుంది. "అని అడిగింది.

"నీ జోలికి రాడులే. నీవేమీ భయపడవద్దు"

" నా జోలికి రాడా?నేనెంత అందంగా వున్నాను. నా జోలికి రాడా ?ఎంత పొగరు?"అంది పువ్వు. అనుకున్నట్లుగానే అతను వచ్చాడు. అంటే, తుమ్మెదే. ఆ తుమ్మెద వచ్చి, అంత వరకూ ఎన్ని పువ్వుల్ని తాకుతూ వచ్చాడో, ఎన్ని పువ్వులలోని మకరందం పీలుస్తూ వచ్చాడో, ఈ పువ్వు దగ్గరకు వచ్చేసరికి, (మన కథానాయకి పువ్వు )అతని యొక్క సహజ స్వభావం తో, తన తొండాన్ని పెట్టి, పువ్వులో ఉన్నటువంటి మకరందాన్ని పీల్చేశాడు. అదంతా చలంగారు ఆ సంఘటనని దాదాపు ఒక పేజిన్నర పాటు వివరంగా వర్ణిస్తారు.

అది అయిపోయాక పువ్వుకి అనిపించిందట "అప్రయత్నంగా రేకలతో, అతన్ని దాచుకుంది. తన ఈనెలతో, సన్నని, ఒంపు తిరిగిన నడుముని కావిలించుకొని లాక్కొంది. తన లోని పచ్చని పరిమళపు గంధాన్ని జల్లింది. తనకి తానే అర్పించుకొంది. "నేను నీదాన్ని"అంది. "నీ కన్నా ఇంకేమీ లేదు "అంది. ఆ తుమ్మెద మధువుని పీల్చడం అవ్వగానే వెళ్ళిపోయాడు. వెళ్లిపోతుంటే, అతని వంక జాలిగా చూసింది. ఆకుల తెరల చాటున సిగ్గు చాటు కన్య. ఏమని లోకం ముందు, సిగ్గు విడిచి అతన్ని అనుగమించగలదు. అతని వెంట వెళ్లగలదు. నాకే గనక రెక్కలుంటేనా?

ఇంక ఎటూ చూడకుండా, తల్లినీ, తండ్రినీ ఆకుల్నీ, మిత్రుల్నీ సమస్తమూ మరచి, అతని వెంట సహచరినై సేవ చెయ్యనా?కానీ, అబల. తన చుట్టూ చిన్నచిన్న వన కన్యలు చేరి, పాడుతున్నారు. దీవిస్తున్నారు. లాలిస్తున్నారు. తన ఒంటి నంతా గర్వంగా చూసుకుంది. ఎంతో సాఫల్యంతో, నిండు తనంతో, లోతులో తన బరువెక్కిన తనలోకి చూసుకుని పొంగిపోయింది. ఇలా మధ్యాహ్నమైంది. సూర్యుడు పైకి లేచి, పెద్దపెద్ద చెట్ల ఆకు నీడల్ని మంట పెడుతున్నాడు. గుంపులు, గుంపులుగా చిలకలు ఆకుపచ్చ మెరుపుల మల్లే ఎగిరిపోతున్నాయి. సాయంత్రం అవుతోంది. నీడలు కూడా పొడవు అవుతున్నాయి. సూర్యుడు క్రిందకు వెళ్ళిపోతున్నాడు. అప్పటికి పువ్వు చూసుకుంది. తనలో కొత్త ప్రాణం కదులుతోంది. చోటుకోసం వెతుక్కుంటూ, తన పక్కల్ని సాగదీస్తోంది.

ఆ తుమ్మెద తన నిండా వదలిన పుష్ప రజనుతో పచ్చనై జారిపోయిన తన పత్రాల్ని ఎండ వెచ్చదనానికి ఒప్పజెప్పి, తన చుట్టూ జరిగే సృష్టిలో తానూ ఒక ముఖ్య పాత్రధారిననే గర్వంతో. ఇంకేం కావాలి అనే నిర్లక్ష్యంగా చూస్తోంది. క్షణమైనా ఆగక, నిరంతరంగా, అలల మీద నాట్యం చేసే సృష్టి లీలలు ఇవి. ఆ పువ్వులో నుండి మరొక మొగ్గ, ఆ రాత్రి పూట మళ్ళీ కళ్ళు తెరచుకోవడానికి సిద్దమవుతోంది. ఈ పువ్వు మాత్రం సాయంకాలం అయ్యేసరికి రేకలన్నీ వాడిపోయి, కింద పడిపోతున్నాయి. సూర్యుడు వెళ్ళిపోయాడు. మొదటి నక్షత్రం ఆకాశంలో కనపడింది.

మొదటి నక్షతంలో నుండి జారిపడిన మిణుకు మిణుకుమనే కాంతి రేఖలో నుంచి వచ్చి నిలిచాడు. ఎవరు?ఎవరో ఒకతను. వచ్చి తనని పిలిచాడు. “నీ జీవితం అయిపోయింది, వెళ్ళిపోదాం రా!” అని. అతను ఎవరై ఉంటాడు. కాలపురుషుడు...! “ఎవరు నువ్వు?”అంది పువ్వు. కానీ, తెలుసు తనకి. గజగజా వణికింది. “అయ్యో! నా జీవితం అయిపోయిందా?వెళ్ళిపోతున్నానా? వెళ్లిపోవాలా?” చుట్టూ చూసింది ఏడుస్తూ... అతను “రా!”అన్నాడు. “నా పాపాయి”అంది. “నీ ప్రాణాన్ని నీ పాపాయి కిచ్చి, నాతో రా!” అన్నాడు. “ఎట్లా రాను?”అని అరిచింది. చివరి అరుపు. చేతిని పట్టుకొని కన్నీళ్లు తుడిచాడు.

“ చూడూ!” అన్నాడు. లోకమంతా పెద్ద వెలుగు. అన్ని రూపాల్నీ, భిన్నత్వాలనీ, తనలో కరిగించుకుంటున్న మెత్తటి వెలుగు. నేల మీద ఎండుటాకుల నుంచి, ఆకాశం మీద నక్షత్రాల దాకా, అన్నిటినీ ఏకం చేసే దివ్య కాంతి. అంతా... అంతా ... వెలుగంతా అతను. అది అతడు తెచ్చిన వెలుగు. మామూలుగా అయితే చీకటి పడి వుంది. “రా!” అన్నాడు. ఆ నవ్వుతో, తన వార్ధక్యం, నిరర్థకత్వం, ఎండుతనం అంతా పోయి, బాల్యం, యవ్వనం, బలం, సంతోషం, మాతృత్వం, ప్రేమ అన్ని అతని ముందు అర్పించి మ్రొక్కింది. అతని చెయ్యి పట్టుకొని అనంత ఆకాశం లోకి ఒక్క దూకు, దూకింది.

ఇక భయం అనేది లేదు. విచారం లేదు, సందేహం లేదు. సమస్తమైన ప్రపంచంతో, కాలంతో అతను సన్నిహితుడు. అతని వేళ్ళని పట్టుకున్న తనని ఏమూల, ఏ రూపంలో నిలిచినా ఆ కొత్త ఉండదు. తన కోసం చేతులు

చాచి ఉంటాయి. చిరునవ్వులు వెలిగి ఉంటాయి. తన ఆగమనం కోసం, గొప్ప విలువలు ఉంటాయి. ఆకాశంలోకి తేలుతూ, భక్తితో అతని మొహం వంక చూస్తూ నవ్వింది. అణచుకోలేక వెళ్ళిపోతున్నప్పుడు కూడా కాల పురుషుడితో "వెళ్ళిపోతున్నాను"అని ఒక్కసారి నవ్విందట.

దాంతో ఆఖరవుతుంది కథ.

చలం గారు ఈ కథని ఆరు పేజీలు రాశారు. అర్ధరాత్రి నుండి, ఆ పువ్వు రేకలు వాడిపోయి, క్రింద పడిపోయేంత వరకు. సుమారు 24 గంటల్లో జరిగినటువంటి ఒక పువ్వు జీవితం. అయితే, పువ్వు యొక్క జీవిత చక్రం గురించి రాసినట్టు వుంటుంది గానీ, ఈ కథను చాలా కోణాల్లో అన్వయించుకోవచ్చు. ఈ పువ్వును ఒక స్త్రీకి ప్రతీకగా చెప్పుకోవచ్చు. ఒక జీవితానికే ప్రతీకగా తీసుకోవచ్చు. ఏ జీవితం అయినా అంతే. మొగ్గగా ఉంటుంది. తరువాత యవ్వనం, తరువాత వృద్ధాప్యం, రాలిపోవడం, ఈ మధ్యలో జరిగే సంఘటనలు. వీటన్నిటికీ, ఒక పువ్వును ప్రతీకగా తీసుకొని, చలంగారు రాసారని అనుకోవచ్చు. ఇటువంటి అన్వయాలన్నీ కూడా పాఠకుల ఊహకి వదిలేసి, ఈ కథను ఒక మనోహరమైన, మనోజ్ఞమైన– ఇంకా చెప్పాలంటే – తాత్వికత దట్టించి సాహితీ ఖండికను తీర్చిదిద్ది, తెలుగు పాఠకులకు కానుకగా ఇచ్చారు. ఇదంతా ఆయన అరుణా చలం వెళ్ళడానికి ఒక సంవత్సరం ముందు జరిగిన సంఘటనల్లోనుంచి వచ్చిన కథ. ఈ "ఓ పువ్వు పూసింది "

మరిన్ని వివరాలు తరవాత భాగం లో తెలుసుకుందాం...

★★★★★★★★★★★

(కొనసాగింపు వచ్చేనెలలో)

అక్షరీకరణ – వి. వెంకటరావు

2019 జూన్ 04 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

COMMENTS